## క్లుప్తంగా

### బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న తారక్‌గౌడ్

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరం గ్రామానికి చెందిన చామకూరి గోపయ్యగౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిరుపేద కుటుంబం. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో బాధిత కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. దీంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే సంకల్పంతో తెలంగాణ విద్య సమితి ప్రెసిడెంట్ తారక్‌గౌడ్ వారి స్నేహితులు, గ్రామస్తులు కలిసి రూ.2 లక్షల 57వేలు సేకరించి మంగళవారం మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పెండెం వెంకట్రావ్, పి.శ్రీను, ఉపేంద్ర, బుచ్చయ్య, నాగయ్య, నరేష్, సత్యం, హుస్సేన్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

### బాడీబిల్డింగ్ పోటీల్లో మొదటి బహుమతి



షీల్డ్, ప్రశంసాపత్రం అందుకుంటున్న సంజయ్

హుజూర్‌నగర్ : పట్టణంలోని నేషనల్ జిమ్‌కు చెందిన జె. సంజయ్ తమిళనాడు రాజధాని చెన్నైలో ఈ నెల 23న జరిగిన మిస్టర్ చెన్నై బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొని జూనియర్ విభాగంలో మొదటి బహుమతి సాధించాడు. అదేవిధంగా సీనియర్స్ 75 కేజీల విభాగంలో 3వ బహుమతిని సాధించి షీల్డ్, ప్రశంసా పత్రం అందుకున్నాడు. కాగా మంగళవారం పట్టణానికి చేరుకున్న ఆయనను జిమ్ కోచ్ ఎస్. రవి, ధన్‌రాజ్, రాజు, వెంకటేశ్ తదితరులు అభినందించారు.

### పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

చిలుకూరు : విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి రూపేందర్‌సింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని కొండాపురం, రామాపురం, ఆర్లెగూడెం, మాధవగూడెం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. అలాగే ఎంపీడీఓ ఈదయ్య మండలంలోని జానకీనగర్, దూదియతండా గ్రామాల్లో పర్యటించారు.


### అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి

మునగాల : మండలంలోని నర్సింహాపురం గ్రామపంచాయతీ పరిధిలోని ద్వారకనగర్‌లో గల వెంచర్‌లో దేవాలయ నిర్మాణం పేరుతో అనుమతులు లేకుండా గ్రామపంచాయతీకి కేటాయించిన స్థలంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమ నిర్మాణం చేపడుతున్నారని, ఆ నిర్మాణాన్ని నిలిపివేయాలని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త డా.వేమూరి సత్యనారాయణ కోరారు. ఈమేరకు మంగళవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి ఎస్.భూపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.

### ఆంజనేయస్వామికి విశేష పూజలు

కోదాడఅర్బన్ : పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వేంచేసియున్న శ్రీఅభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు చేశారు. స్వామికి పంచామృతాభిషేకాలు, సింధూరాభిషేకం, ఆకుపూజ, పుష్పాలంకరణ గావించారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకూరి అంజయ్య, కార్యదర్శి కొత తిరుపతయ్య, అన్నదాన నిర్వాహకులు దేవరశెట్టి హనుమంతరావు, దాతలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పండ్ల తోటల సాగుపై చైతన్యవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

నడిగూడెం : పండ్ల తోటల సాగుపై రైతులను చైతన్యవంతం చేయాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ఉపాధి హామీ పథకం సిబ్బందికి పండ్ల తోటల పెంపకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న రైతులకు 12 రకాల పండ్ల మొక్కలు పెంచుకొనే అవకాశం ఉందన్నారు. తోటల పెంపకంలో భాగంగా గుంతలు తీయడం, మొక్కలు నాటడం, ఊత కర్ర కట్టడం, మొక్కల కొనుగోలు, ఎరువులు వేయడానికి ప్రభుత్వం సహకరిస్తుందని, మూడు సంవత్సరాల వరకు ఉపాధి హామీ పథకం ద్వారా 100 శాతం రాయితీ ఇస్తుందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు, ఎంపీఓ ఎర్ర.లింగారెడ్డి, ఏపీఓ నగేష్, ఈసీ ఉమ్లా నాయక్, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షం.. మెట్ట పంటలకు ఊతం

- వాడిపోయిన పత్తి, కంది తదితర చేలకు ప్రాణం పోసిన వానలు
- పూర్తిగా మొలకలొచ్చిన రెండవసారి విత్తిన గింజలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు
- వర్షాలు ఇలాగే కొనసాగితే నీరు నిలిచి నష్టపోయే ప్రమాదం



కరివిరాల పరిధిలోని పత్తి సాగు

కోదాడరూరల్ : రైతులు విత్తనాలు నాటి ఇరవై రోజులైనా సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. సాగు ప్రారంభంలోనే ఇలా ఉంటే పంటలు పండుతాయా లేదా అని దిగులు చెందారు. వర్షాలు లేక పత్తి, పెసర, కంది వంటి పంటలకు రెండు సార్లు విత్తనాలు విత్తారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి రెండవసారి విత్తనాలు విత్తాం అసలు వరుణుడు కరుణిస్తాడా లేదా అని అనుకున్నారు. గత వారం రోజులుగా మోస్తారు వర్షాలు కురిసి మెట్ట పంటలకు జీవం పోయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో కోదాడ డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, కంది, పెసర వంటి పంటలు ఇప్పటివరకు ఆశాజనకంగానే ఉన్నాయి. అయితే ఇప్పటివరకు కురుస్తున్న వర్షాలు సరే కానీ ఇక మించి భారీ వర్షాలు పడితే నేలల ఊటబట్టి గుంటక, గొర్రులతో అరకతోలడం సాధ్యం కాదని రైతులు అంటున్నారు. పంటలకు తెగుళ్ల సోకే ప్రమాదం కూడా ఉంటుందని చెబుతున్నారు.

**ప్రధాన సాగు వరి అయినప్పటికీ..**

కోదాడ డివిజన్‌లో ఎక్కువగా వరి సాగు ప్రధానమైనప్పటికీ మునగాల, మోతె, నడిగూడెం మండలాల్లో రైతులు వరితో పాటు ఎక్కువ విస్తీర్ణంలో పత్తి సాగు చేస్తున్నారు. కంది, పెసర, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలు సైతం పండిస్తున్నారు. పత్తి సాగును జూన్ చివరి, జూలై మొదటి వారంలో ప్రారంభించారు. విత్తనాలు విత్తిన తర్వాత దాదాపు ఇరవై రోజులవరకు వరుణుడు మొఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో విత్తిన విత్తనాలు మొలకెత్తి పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. కంది, పెసర పంటలకు కూడా వర్షం ఊతం ఇచ్చింది.

**డివిజన్‌లో పంటల సాగు ఇలా..**

కోదాడ డివిజన్‌లో పత్తిసాగు సాధారణ అంచనకంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది. ఈ ఏడాది 11967 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఎక్కువగా మునగాల మండలంలో 6170 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మోతె మండలంలో 3680 ఎకరాలు, నడిగూడెం మండలంలో 2082 ఎకరాలు, కోదాడ మండలంలో 25 ఎకరాలు, అనంతగిరి మండలంలో 10 ఎకరాల్లో పత్తి సాగు అయినట్లు అధికారులు తెలిపారు. వీటితో పాటుగా 176 ఎకరాల్లో కంది, పెసర 41 ఎకరాల్లో సాగు చేశారు.

**వర్షం రాకపోతే పత్తి చేలపై ఆశలు పోయేవి**



వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి గింజలన్ని మొలకెత్తాయి. వర్షాలు కురవకతే చాలా మంది రైతులు పత్తి పంటపై ఆశలు వదులుకోవాల్సి వచ్చేది. జూన్ నెలలో విత్తనాలు పెట్టినా కొన్నిచోట్ల మొలకలు రాక రెండోసారి గింజలు విత్తాల్సి వచ్చింది. ప్రస్తుత వానాలతో ఇప్పటివరకు పత్తి పంటలు బాగున్నాయి.

– జంగిలి వీరబాబు, కాగిత రామచంద్రపురం, నడిగూడెం మండలం

**నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి**



ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు నిలిచే అవకాశం ఉంది. నీరు నిల్వ ఉంటే పంటలకు తెగుళ్ల సోకుతుంది. రైతులు పత్తి, కంది, పెసర పంటల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలి. వేరు, కాండం కుళ్ల తెగుళ్ల రాకుండా నివారణకు అధికారుల సూచనల మేరకు పంటకు కావాల్సిన మందులను పిచికారి కాని, వేరు మొదల్లోకాని పోసుకోవాలి.

– పాలెం రజిని, ఏఓ, కోదాడ

## వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుని నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు గావించారు. ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాభంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాల మహోత్సవం నిర్వహించారు. క్షేత్ర పాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాబాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీ నరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, బ్రహ్మాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పాఠశాల పరిశీలన



మఠంపల్లి : బక్కమంతులగూడెంలో పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ, సర్పంచ్

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెంలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఎంఈఓ పానుగోతు చత్రునాయక్ స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల దృష్ట్యా శిథిలావస్థలో ఉన్న పాఠశాల నుంచి విద్యార్థులను పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల గదులలోకి తరలించినట్లు తెలిపారు. సర్పంచ్ విజయకుమారివెంకటరెడ్డి, ఎంపీటీసీ నాగిరెడ్డి, ఎంపీఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

**అంగన్‌వాడీ, పాఠశాల భవనాలు పరిశీలన**

మోతె : మండలంలోని రాఘవాపురం, నామవరం గ్రామాల్లో మంగళవారం మండల ప్రత్యేక అధికారి తిర్పతయ్య అంగన్‌వాడీ, పాఠశాల భవనాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో విద్యాబోధన చేయవద్దన్నారు. అసంపూర్తిగా నిర్మించిన అంగన్‌వాడీ, పాఠశాల భవనాల వివరాల నివేదికను విద్యాశాఖ అధికారులకు అందజేస్తామన్నారు. అనంతరం పల్లె ప్రకృతి వనం, నర్సరీ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ హరిసింగ్‌నాయక్, రాఘవాపురం సర్పంచ్ గంగులు, పంచాయతీ కార్యదర్శి, తదితరులు ఉన్నారు.

## శిథిలావస్థకు చేరిన భవనాలు ఉపయోగించొద్దు

- డీపీఓ యాదయ్య



హుజూర్‌నగర్‌లో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం గదికి తాళం వేస్తున్న డీపీఓ యాదయ్య

హుజూర్‌నగర్ : శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాలను ఉపయోగించవద్దని డీపీఓ యాదయ్య సూచించారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని గోవిందపురం, క్యాంప్ హైస్కూల్, బాలికల ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరిన పలు భవనాలను, మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్న శిథిలావస్థలో ఉన్న భవనాన్ని సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శాంతకుమారి ఎంఈఓ సైదానాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు రాధాదుర్గా, అబ్దుల్ లతీఫ్, మాబాషా, సీఆర్పీ సైదులు పాల్గొన్నారు.

## మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి



కోదాడఅర్బన్ : కోదాడలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు



హుజూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మునగాల : మణిపూర్ రాష్ట్రంలో కుకీ గిరిజన తెగలవారిపై హింసాకాండ కొనసాగిస్తూ సభ్యసమాజం తలదించుకునే విధంగా మహిళలను వివస్త్రలను చేసి అత్యాచారం చేసి వీధుల్లో తిప్పుతూ పాశవికంగా కొట్టి చంపిన దోషులను కఠినంగా శిక్షించాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు బుర్రి శ్రీరాములు, ఉపాధ్యక్షుడు దేవరం వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరిగిన సంఘటనలకు నిరసనగా మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గణపవరం క్రాస్‌రోడ్డులో నిరసన తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ఒట్టెపు సైదులు, మండల కార్యదర్శి గడ్డం వినోద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిడమర్తి వెంకన్న, మండవ శేషు, గోపాల్, సత్యం, నారాయణ పాల్గొన్నారు.

**మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలి**

హుజూర్‌నగర్ : మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగారపు పాండు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం హుజూర్‌నగర్‌లో సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో గత 83 రోజులుగా మోయితీలు, కుకీలకు మధ్య జరుగుతున్న మారణహోమాన్ని ఆపేందుకు కేంద్రం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దుగ్గి బ్రహ్మం, పి.హుస్సేన్, త్రివేణి, యోనా, వీరమల్లు, వెంకటేశ్వర్లు, సోమయ్య, త్రివేణి, వెంకటనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

**మణిపూర్ బాధ్యులను కఠినంగా శిక్షించాలి**

కోదాడఅర్బన్ : మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలపై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మిట్టగడుపుల ముత్యాలు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కోదాడలోని ప్రధాన రహదారిపై సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దాసరి శ్రీనివాస్, నక్క గోపి, ఇటికాల శేషయ్య, గంటెల శ్రీను, బాబు, వెంకన్న, గురుస్వామి, రాముడు, రమేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- కలెక్టర్ వెంకట్రావు



మునగాల : గణపవరంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో చేపట్టిన పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు



అనంతగిరిలో మిషన్ భగీరథ ట్యాంకును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

మునగాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించి తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా మునగాల మండలం గణపవరం గ్రామపంచాయతీలో చేపట్టిన పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, శ్మశానవాటిక నిర్మాణం, మురుగు కాల్వలు, పల్లె ప్రకృతి వనం పనులను ఆయన స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గణపవరం గ్రామ పంచాయతీ జాతీయస్థాయికి ఎంపికయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ పాలకవర్గంతో ప్రత్యేక సమావేశం నిర్వహించి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో చేపట్టాల్సిన పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, ఎంపీఓ ఎస్.భూపాల్‌రెడ్డి, ఉపాధి ఏపీఓ శైలజ, స్థానిక సర్పంచ్ కొండపల్లి విజయమ్మ, ఉపసర్పంచ్ జితేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వీరారెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ వసంత పాల్గొన్నారు.

**పాఠశాల తనిఖీ**

కలెక్టర్ వెంకట్రావు మునగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల భవనం పైపెచ్చులూడి ప్రమాదకరంగా ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని, ఇంతవరకు మరమ్మతులు ఎందుకు చేపట్టడం లేదని అధికారులు, ప్రధానోధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్థానిక మండల విద్యాధికారి సలీమ్ సమాధానమిస్తూ పాఠశాలను నిర్మించి ఆరు దశాబ్దాలు అవుతున్నందున మొత్తం డిస్‌మెటల్ చేయాల్సి ఉందని వివరించారు. 8వ తరగతి గదిలోకి కొద్దిసేపు ఉపాధ్యాయుడిగా వ్యవహరించి విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జవహర్, ప్రధానోపాధ్యాయుడు డి.సీతారామరాజు ఉన్నారు.

**అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

నడిగూడెం : వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరిన తరగతి గదులను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున పాతకాలంనాటి భవనాల్లో తరగతులు నిర్వహించవద్దన్నారు. ప్రస్తుతం పంచాయతీ వర్కర్లు సమ్మె చేస్తున్నారని, పారిశుద్ధ్యంవిషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ యాతాకుల జ్యోతి, తహసీల్దార్ టి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఏఓ ఎం.రాజగోపాలరావు, ఎంపీఓ లింగారెడ్డి, ఆర్ఐలు గోపాలకృష్ణ, బాబా, సర్పంచ్ నాగలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు ఉన్నారు.

**అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**

అనంతగిరి : ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండలంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని పరిశీలించి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి శిథిలావస్థకు చేరిన తరగతి గదుల స్థానంలో మరో రెండు నూతన గదులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే బీసీ కాలనీలోని మిషన్ భగీరథ ట్యాంకుకు నీరు రావడం లేదని సర్పంచ్ తెలపడంతో ట్యాంకును పరిశీలించి మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న మరమ్మతు పనులతో పాటు ల్యాబ్ ను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. ల్యాబ్‌లో ల్యాబ్ అసిస్టెంట్ లేకపోవడంతో ఆగ్రహించిన ఆయన డాక్టర్‌ను ప్రశ్నించారు. సెలవులపై వెళ్లాడంటూ చెప్పడంతో సెలవుల్లో ఉన్న సిబ్బంది వెంటనే విధులకు హాజరుకావాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ఎవ్వరూ సెలవులు పెట్టరాదని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సంతోష్ కిరణ్, ఎంపీడీఓ పరిమి విజయ, పీఆర్ ఏఈ హర్ష, ఎంఈఓ సలీంషరీఫ్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**దరఖాస్తుల ఆహ్వానం**

మునగాల : మండల కేంద్రంలోని ఓపెన్ స్కూల్‌లో 2023– 24వ విద్యాసంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందేందుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.సీతారామరాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆగస్టు పదవ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆలస్య రుసుముతో ఆగస్టు 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**గ్రంథాలయానికి మరమ్మతులు చేయిస్తా**

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో గ్రంథాలయం శిథిలావస్థకు చేరి స్లాబ్ పెచ్చులు ఊడిపోతోందని సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, గ్రామస్తులు ఎస్ఆర్ఐ సాముల జైపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం ఆయన గ్రంథాలయాన్ని పరిశీలించారు. రూ.4 లక్షలతో మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అన్నెం కొండారెడ్డి, గ్రంథాలయం నిర్వాహకుడు సోమవరపు వీరనరేష్, గ్రామ పెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.

**ఉద్యమ జాగరణ కరపత్రం ఆవిష్కరణ**

గరిడేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం టీపీయూఎస్ ఉద్యమ జాగరణ కరపత్రాన్ని ఆ సంఘం నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం కన్వీనర్ జానకిరాములు, మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

**పీర్ల పండుగకు ఆర్డీఓకు ఆహ్వానం**

హుజూర్‌నగర్ : పట్టణంలో జరుగుతున్న పీర్ల పండగ సంబరాల్లో పాల్గొనాలని కోరుతూ ముజావర్లు మంగళవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి ఆహ్వానం అందజేశారు. పీర్ల ముజావర్లు షేక్ సైదా, మొయిన్, మీరా పాషా ఉన్నారు.

**విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి**

కోదాడఅర్బన్ : ఎస్సీ వర్గీకరణ, తదితర సమస్యల సాధనకు ఆగస్టు రెండో వారంలో నిర్వహించబోయే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ విద్యార్థి సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మామిడి కరుణాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం కోదాడలోని ఎంఎస్ కళాశాలలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఏపూరి రాజుమాదిగ, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు భూక్య రవినాయక్, ఎంఎస్‌పీ నాయకులు రామ్‌కుమార్, సత్యరాజు, గోపి, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**పాఠశాలల పనివేళల మార్పు ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి**

గరిడేపల్లి : ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పనివేళల మార్పు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని, పనివేళలు ఉదయం 9 గంటలకు బదులు 9: 30 గంటలకు ప్రారంభించడం అశాస్త్రీయమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలల పనివేళలు మార్చాలంటే నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేసి వారి అభిప్రాయాలను సేకరించి నిర్ణయించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆమోదయోగ్యం అయిన పాత పని వేళలను కొనసాగించాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి రణబోతు రవీందర్, మండల అధ్యక్షులు ఎలక సైదిరెడ్డి, బసవ కోటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

## ఆహారభద్రత కార్డులు మంజూరు చేయాలి

మునగాల : దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఆహారభద్రత కార్డులు మంజూరు చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి భాష్యం వంశీయాదవ్, మణికంఠ, పరుశురాం పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

మఠంపల్లి : పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు దరిచేరవని మండల స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి అన్నారు. మంగళవారం మఠంపల్లిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. మురికి నీటి గుంతలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది ప్రజలకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయులు, పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్‌నాయక్, వైద్యసిబ్బంది, ఆశా వలంటీర్లు తదితరులు ఉన్నారు.

## టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నంబూరి సూర్యం



నంబూరి సూర్యం

కోదాడరూరల్ : టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోదాడకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు నంబూరి సూర్యం నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ప్రకటన విడుదల చేసినట్లు సూర్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ ప్రాంతంలో పార్టీ పునర్వైభవం తీసుకొచ్చేందుకు కృషిచేస్తానని తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌తో పాటు తన ఎన్నికకు సహకరించిన స్థానిక నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నేరేడుచర్లలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

మునగాల : గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ)ను రెగ్యులరైజ్ చేస్తూ సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేయడంపై హర్షిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏలు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల శాఖ అధ్యక్షుడు గట్టు ఉపేందర్, లంజేపల్లి వెంకన్న, లాళ్లపాక వెంకటనారాయణ, షేక్ జానీ, జిల్లేపల్లి సైదులు, శేఖర్, ఖాసీం, నాగేశ్వరరావు, విజయ, విజయలక్ష్మి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు : వీఆర్ఏలను క్రమబద్ధీకరిస్తూ సీఎం కేసీఆర్ జీఓ విడుదల చేయడాన్ని హర్షిస్తూ మంగళవారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏలు సురేష్, అలివేలు, మాధవి, రవి, నాగరాజు, సాయి, ఖలీందర్, ప్రసాద్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : వీఆర్ఏలకు పేస్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై మండల వీఆర్ఏలు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం నేరేడుచర్లలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షురాలు పేరుమాళ్ల పిచ్చమ్మ, వీఆర్ఏలు లక్ష్మి, ఝాన్సీ, చంద్రకళ, రాధా, మణి, శోభ, అప్పయ్య, ఖాదర్, సైదా, అనిల్, అంతయ్య, నాగయ్య, నాగు, సైదులు తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ



మునగాల : బీమా చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోదాడరూరల్ : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. మండలంలోని నల్లబండగూడెంకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త యరమల ఉపేందర్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడు పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును మంగళవారం మృతుని భార్యకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యరమల సుశీల బెంజిమెన్, ఎంపీటీసీ క్రాంతికుమార్, గోపి, కోటేశ్వరరావు, ప్రగాడ వెంకటేశ్వరరావు, శేఖర్, భద్ర ఉన్నారు.

**మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత**

మునగాల : మండలంలోని రేపాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మోత్కూరి రామాచారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మృతిచెందాడు. బీఆర్ఎస్ పార్టీ రూ.2 లక్షల బీమా చెక్కును రామాచారి భార్య సరితకు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్ అందజేశారు. మండల నాయకులు కందిబండ సత్యనారాయణ, సుంకర అజయ్‌కుమార్, ఉప్పుల యుగంధర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఉపేందర్‌రావు, గ్రామశాఖ అధ్యక్షుడు ఆదిరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ఆర్డీఓకు ఫిర్యాదు

హుజూర్‌నగర్ : కోదాడ మండలం గుడిబండ శివారులోని అడ్లూరు పునరావాస కేంద్రంలో ప్లాట్ల విషయంలో అవకతవకలు జరిగాయని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్పంచ్ కె.తిరపయ్య మంగళవారం హుజూర్‌నగర్‌లో ఆర్డీఓ ఎస్.జగదీశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఖాళీగా ఉన్న ప్లాట్లను కొనుగోళ్ల పేరుతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయిస్తున్నారని ఆర్డీఓకు వివరించారు. కార్యక్రమంలో రాధమ్మ, లక్ష్మి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.